
# రాధ సాధన




## రత్నం

క్రృష్ణమూర్తి సైకాలజీ స్పెషలిష్టు.

అతనియిల్లు దానికో ప్రయోగశాల. తనూ ... రాధా ... విజయ్ – దానిలో పనిముట్లు.

ప్రయోగఫలితం చూసి బిత్తరపోయి, చిత్తైపోయాడు ఆ ప్రొఫెసర్.

ఆ ఫలితానికి మూల్యం ఇరవై యేళ్ళ విరహం !

కాస్తా... కూస్తా ... ! ఇరవై యేళ్ళ విరహం !

* * *

ఆరోజు భర్త కతియిష్టమైన పిండి

వంట చేసింది రాధ. కవ్విస్తూ నవ్విస్తూ రాచుకు రాచుకు తిరిగింది. పెళ్ళి నాటి పట్టుచీర మళ్ళా కట్టుకుంది. వెన్నెల్లాంటి నిండునవ్వు ... చాలా రోజులకు ఆమె ముఖంలో తాండవించింది.

అర్ధాంగి ఉత్సాహం చూస్తూంటే ... యవ్వనపురోజులు మళ్ళా తిరిగి వచ్చిన ట్లనిపించింది కృష్ణమూర్తికి.

కాని గడచినకాలం మళ్ళా రాదు. ఆ ఖుష్...ఆ నిషా...ఆ పొంగులువారే కాంక్షలూ ... ఆ తీపికలలూ ... ఆ రోజులే వేరు.

ఇప్పుడు తనకు ఏభై యేళ్ళు. రాధ వయసుమళ్ళుతున్న యిల్లాలు. తాము వాడిపోతున్న పూలు! తమ జీవితపు ప్రొద్దు వాటారిపోతున్నది.

కాకపోతే తాను లెక్చరర్లా ప్రొఫెసర్ అయ్యాడు ... అంతే! వేదాంతిలా నవ్వుకొన్నాడు కృష్ణమూర్తి ... భార్య తరహా చూచి ... గడచిన జీవితాన్ని తలచుకొని.

మనమరాల్ని బుట్టబొమ్మలా అలంకరించి భర్తచేతి కందించింది రాధ. ఆ పాప రాధ తపఃఫలం! పట్టుదలకు చిహ్నం!

స్త్రీ అవసరమైతే ఎంత త్యాగం చేస్తుందో...ఎంత తపన పడుతుందో... ఎంత తపసు చేస్తుందో అప్పు డర్ధమయింది కృష్ణమూర్తికి.

మనమరాల్ని జోకొడుతున్న అతని బుర్రలో గతమంతా గిర్రున తిరిగింది.

* * *

అవి రాధ తొలివలపు జుర్రుకొంటున్న క్రొత్తరోజులు.

వాకిటికెదురుగ్గా ... పడకగదిలో "బొమ్మ"ను తగిలిస్తూ చిలిపిగా చూశాడు కృష్ణమూర్తి... అర్ధాంగి కళ్ళల్లోకి.

అహంకారం పోతపోసినట్లు బొట్టు పెట్టినభర్తను జూచి ఉడుకుపోయింది రాధ.

"మొత్తానికి మగపురుష లనిపించుకొన్నారే ... !" ఆ ఎత్తిపొడుపుతో బొమముడీ .. చిరుముడీ దీర్చుతీసింది.

మీసం తడుముకున్నాడు కృష్ణమూర్తి మగాడి లక్షణంకోసం.

రోషంకన్పించని ప్రియుని ముఖంకేసి పులుకుపులుకునా చూచి ఉక్రోషపడింది రాధ. భర్త అధికారంలో తన ఓటమి కనిపించి మరింత రెచ్చిపోయింది.

కాఫీకప్పు టేబుల్ మీద గజగజ లాడించి. వంటింట్లో గిన్నెలు పెద్దగా చప్పుడు చేసినయ్.

రాధ తన ఆక్షేపణల్ని ఎంతగా వెలిబుచ్చినా మూర్తి ముఖంలో విజయ గర్వం తాండవిస్తూనేఉంది.

వంటింట్లో ఉన్నా ఆబొమ్మే కన్పిస్తున్నది; వాకిట్లో కెళ్ళినా అదే ప్రత్యక్షం ... పడకగదిలో మళ్ళా అదే ! భర్త కళాప్రతిభ ఆ బొమ్మ అమర్చటంలో గడితేరింది. ఇల్లంతా ఎటుతిరుగుతున్నా ఆబొమ్మే వెన్నంటి తరుముతున్న ట్లనిపించింది రాధకు.

ఆ బోసినోరు...కటికిగుండెలోనైనా

వాత్సల్యామృతాన్ని ఊరించే మధుర హాసం... వెన్నెలపాప చూసుకొనే పాల బుగ్గలు... అచ్చు ప్రాణం పోసినట్టున్న ఆబొమ్మ ఓసమస్యయి కూర్చున్నది రాధకు.

ఆ బొమ్మకన్నా భర్తముఖంలో తాండ విస్తున్న విజయగర్వం ... మాట నెగ్గించుకొంటున్న స్పర్థ... రాధ నింకా ఉడికించినయ్.

ఆ క్రిందటిరోజు ... జూకామల్లెల పందిరి ప్రక్కగా ... పుచ్చపువ్వు వెన్నెల్లో రాధకూ మూర్తికీ పందెం పడింది.

"అబ్బాయి కావా" లన్నాడు ప్రియురాలి కౌగిలింతలో మూర్తి.

"ఉహూ...అమ్మాయి!" తన కోరిక వెలిబుచ్చింది రాధ ... భర్తమాట ఎందుకు నెగ్గాలని.

"అబ్బాయే!"

"అమ్మాయే!..." ఎప్పుడో పుట్ట బోతున్న 'బిడ్డ' ఆ ప్రేయసీ ప్రియుల్ని ప్రణయకలహంలోకి దింపింది.

అంతా తమ చేతిలో ఉన్నట్టు ఇద్దరూ పంతాలకు పోయారు.

"అబ్బాయి పుడితే ఏమిస్తావ్?"

"మరి అమ్మాయి పుడితేనో!..."

"ఓ ముద్దు."

"వజ్రాలహారం చేయిస్తా రనుకు న్నానే. ఇంతేనా?" కిలకిలా నవ్వింది రాధ, ప్రియుడి గాఢాలింగనంలో కరిగి పోతూ.

పుచ్చపువ్వులా విరిసిన ఆ పాల వెన్నలా... గుబాళిస్తున్న మల్లెపొదా వాళ్ళ పందేనికి సాక్ష్యంగా మిగిలినయ్ ఆ అర్ధరాత్రి.

ఆ మరునాడే మూర్తి ఎదురుగా కన్పించే ఆ బోసినవ్వుల బొమ్మను ఎగ్జిబిషన్ నుంచి తెచ్చాడు.

ఆ బొమ్మ ఎంత ముద్దొస్తున్నా... మనసులో వాత్సల్యం పొంగుతున్నా... ఆహ్లాదం అనుభవిస్తున్నా...భర్త కల్పి స్తున్న వాతావరణం కవ్వింపుచర్యగా భావించింది రాధ.

తనే చెప్పేడు - ఎన్నో కథలు - మూర్తి.. వెనుకటివీ, ఇప్పటివీ!

పడకగదిలో సింగారం ఎంత పనైనా చేస్తుందట!

పాండురాజు తెల్లగా పుట్టేట!

ధృతరాష్ట్రుడు పుట్టుగ్రుడ్డి అయేట్ట!

పాములు ఎప్పుడూ మనసులో మెద లటం మూలాన ఎవరికో అటువంటి బిడ్డలే పుట్టేరట!

పడకటింటిలో ఆ బొమ్మలూ, అవీ అందుకేనట!

—ఎన్నో చెప్పేడు మూర్తి.

తనమాట నెగ్గించుకోటానికి భర్త పన్నుతున్న వ్యూహం అర్థమయింది రాధకు. భర్త చేస్తున్నపని చూస్తున్న కొద్దీ కోపమూ పట్టుదలా పెరిగిపోయి నయ్ రాధలో.

రాధ వంశం పంతానికి పెట్టిందిపేరు.

వాళ్ళ తాత చుట్టూ పదూళ్ళకు సంత ర్పణ చేశాడు, పోటీదారుమీది పంతం కొద్దీ! వాళ్ళ నాన్న ప్రతిష్ఠకు పోయి, ఉన్న ఆస్తంతా అమ్మి బుణాలు తీర్చేడు. కాలేజీలో ఉపన్యాసాల పోటీలో పంతంకొద్దీ వాదిస్తున్న రాధ, మూర్తి ప్రేమకు పాత్రురాలయి అర్ధాంగి అయింది!

రాధ అభిజాత్యం ఊరుకోనిస్తుందా మరి!

పని ముగించుకొని ప్రతివాదిలా వచ్చి కూర్చుంది మూర్తి కెదురుగా.

"ఎంత పోసి తెచ్చా రేమిటి?" మూర్తి బలహీనత తెలిసిన రాధ డబ్బు సంగతి కదిలించింది. అ గృహ సామ్రాజ్యానికి రాధ ఆర్థిక మంత్రిణి. ఇన స్పెట్టె తాళంచెవి ఎప్పుడో ముదేశాడు ఆమె కొంగున మూర్తి.

"అబద్ధం కావాలా, నిజం కావాలా?" నిర్లక్ష్యంగా కళ్ళు మూశాడు, పడక కుర్చీలో వెల్లికిలా పండుకొని, పైకి చూస్తున్న మూర్తి.

"మీ రెప్పుడు నిజం చెప్పారు లెండి!" కసికొద్దీ ఎత్తిపొడిచింది రాధ.

పకపక నవ్వాడు మూర్తి. రాధ మరింత రుసరుస లాడింది.

"రాధా! నా పిచ్చి రాధా! కోపం వస్తే ను వ్వెంత బాగుంటావని;" ఉబ్బేశాడు మూర్తి నవ్వు ఆపుకొంటూ.

"అబ్బో! రాధట రాధ! పిచ్చిదాన్ని గనకే ఏ ఆట ఆడినా సాగుతున్నది;" మూతి ముడిచిన రాధ కోపం మూర్తి గుండెల్లో ఇంకా పరిహాసాన్ని రేపింది.

"నువ్ కూడా నాథా అనరాదూ? నాటకానికి హంగు సరిపోతుంది;" ఇక నవ్వాపుకోలేక విరగబడ్డాడు మూర్తి.

రాధ కళ్ళల్లో నవ్వు తొంగిచూసింది. బయటపడితే లోకు వౌతానని బెట్టు చెడ కుండా బిగబట్టుకొంది. అనునయంలోకి దిగి ఏడిపించా లనుకొంది.

"ఎక్కడిదండీ డబ్బు!"—అప్పు చేసి నందుకు చీవాట్లు పెట్టా లనుకొంది రాధ.

"జానకి ఇచ్చింది!" — ఏం సమాధానం వస్తుందోనని రాధవైపు చిలిపిగా చూశాడు మూర్తి. భార్యను ఉడికించ డము అతని కో సరదా!


మరో స్త్రీ పేరు వినేప్పటికి...రాధ సహనం కట్టలు తెంచుకొంది.

ఎప్పుడు కదిలించినా 'జానకి ఇచ్చిం దంటాడు...మాలతి వచ్చిందంటాడు... సీతతో ఊరేగా నంటాడు ... ప్రభతో షైర్లు కొట్టే నంటాడు.'

తనను ఏడిపించడానికి పన్నిన ఆ వ్యూహంలో చిక్కుకొనేది రాధ. ఎక్కడ లేని ముభావం వచ్చేది ముఖంలోకి. ఉక్రోషంలో నిరసన వెలిబుచ్చితేగాని ఆ పొంగు తగ్గేదికాదు.

'జానకి ఇచ్చిందట జానకి!' — మండిపోయింది రాధకు.

"ఏముందీ ... ఇలానే అ ప్పు లు



చేయండి...చివరికి చిప్ప చేతికి వస్తుంది. మీ జల్సాలూ...మీరూ ఎట్లా ఊరేగితే నాకేం!"—బడబడా దులిపేస్తున్నట్టు తిరస్కారాన్ని వెళ్ళబుచ్చుతున్న రాధ అమాయకత్వానికి కడుపుబ్బా నవ్వేశాడు మూర్తి

ఆవిడ కోపానికి అసలు కారణమేమిటో మూర్తికి తెలుసు.

దానికి కారణం జానకీకాదు...డబ్బూ కాదు!

ఎదురుగ్గా కన్పించేబొమ్మ!
నవ్వులు ఒలకబోసే బుజ్జాడి బొమ్మ!

— అసలు రహస్యం తెలిసిన ఆ సైకాలజీ లెక్చరర్‌కు నవ్వు రాక ఏం వస్తుంది! ఆ మూతిముడుపులూ...చిడుముడి దీర్ఘాలూ...కళ్ళనీళ్ళూ...పరిహాసాలే సాంసారిక జీవితానికి...రసానందైక సామ్రాజ్యానికి సోపానాలని మూర్తి సిద్ధాంతం.

* * *

ఓ శుభముహూర్తాన మూర్తీ రాధల వలపుపంటగా 'విజయ్' పుట్టేడు. కాని ఆ ఆనందం ఎక్కువకాలం నిలవలేదు మూర్తికి.

కొడుకు పుట్టిన తర్వాత రాధ తత్వం మారిపోయింది. ఏదో నిగూఢమైన కాఠిన్యము ఆమె హృదయంలో పేరుకొంది. ఓ ప్రతీకారభావం ఘనీభవించి ఆమె గుండెలో గూడు కట్టుకొంది. తుపానుకు ముందుండే నీరవత ఆమె నావేశించింది.

రాధ నవ్వుతుంది.. మాట్లాడుతుంది ...కాని వెనుకటిలా కాదు! వ్రతనిష్ఠలో నున్న యోగినిలా ... అన్నీ అనుభవించిన అద్వైతిలా!.

రాధలోనిమార్పు మూర్తి పసికట్టేడు. చేసేది లేక చూస్తూ ఊరుకున్నాడు. కవ్వించాడు... నవ్వించాడు .. రెచ్చగొట్టాడు... ఉహుం, రాధ ఉత్త మూగి... కొయ్యబొమ్మ ... దిగాలుపడిపోయాడు మూర్తి.

కొడుకే రాధకు సర్వస్వమైపోయాడు. కొడుకు పెంపకంలో ఉన్న శ్రద్ధ భర్త మీద లేదు ఆమెకు. ఆ దంపతుల ప్రణయ సామ్రాజ్యంలో 'విజయ్' ఓ ప్రతిబంధకమై కూర్చున్నాడు.

కాని పరిస్థితి మరీ ఇంత విషమిస్తుందనుకోలేదు మూర్తి. కక్షపట్టినట్టు తనను పరోక్షంగా సాధించటం మొదలెట్టింది రాధ. విజయని ఎంత పాడుచెయ్యాలో అంతా పాడుచేస్తున్నది. ఆడంగిలక్షణాలన్నీ కావాలని అలవాటు చేస్తున్నది.

ఆ రోజు ...

పత్రిక చూస్తున్నా డన్నమాటేగాని, మూర్తి మనసంతా వరాండాలో ఆడుకొంటున్న 'కొడుకు' మీదే ఉంది.

ఆడపిల్లల్తోతప్ప వాడు ఆడుకోడు. ఎంతసేపూ చింతపిక్కలూ . గవ్వలూ .. చెమ్మచెక్కా...తొక్కుడుబిళ్ళా - ఇవీ వాడి ఆటలు.

మగపిల్లల్తో కలవనేకలవడు.

బయట 'పెళ్ళి' ఆట ప్రారంభమయింది.

లక్కపిడతలనిండా బియ్యం...పప్పు ... బెల్లం – పెళ్ళి సరంజామా అంతా ప్రోగయింది. తాటిఆకు బొమ్మలకి చీరలు కట్టేరు; పమిటలు వేశారు; రవికలు తొడిగేరు; పూసలనగలు అలంకరించారు. ఆ ముత్తైదువల్ని చక్కగా పీటలమీద గోడకానించి కూర్చొబెట్టేరు.

తలంబ్రాలూ... మంగళసూత్రాలూ తయారయినయ్.

"విజయ్‌ని పెళ్ళికొడుకుగా కూర్చొబెడదా," మన్నది ఎదురింటి పంతులమ్మగా రమ్మాయి .. చిట్టి.


''ఉహుం...నేను పెళ్ళికూతుర్ని ... నువ్వే పెళ్ళికొడుకువి!'' అని మారాం మొదలెట్టేడు విజయ్.

ఆడపిల్లలంతా నవ్వేరు.

విజయ్ బిక్క మొగం వేసి ''అమ్మా ..!'' అంటూ ఏడవటం సాగించాడు.

లేచి రెండు తగిలిద్దా మనిపించింది మూర్తికి.

ఇంతలోనే వంటింట్లోనుంచి ఊడి




"నిన్న మేము డాబామీద వెన్నెల విందారగించాము."
"ఎంత అదృష్టం! ఎంత హాయి!"
"ఏంహాయో! లైట్లు లేక చచ్చిపోతున్నాము."

పడింది రాధ... "ఏమిటరా...!" అంటూ.

"అమ్మా... చూడవే... నేను పెళ్ళికూతురుగా ఉంటానంటే వీళ్ళంతా నవ్వుతున్నారే!" రిపోర్టు చేశాడు ముద్దులకొడుకు బుంగమూతి పెట్టి.

"సరేలేమ్మా... నువ్వే ఉందువు గానిలే...! ఏమే చిట్టీ! మా విజయను వద్దన్నారంటే ఊరుకొనేది లేదు. అల్లరి చేయకుండా ఆడుకొంటే అందరికీ తాయిలాలు పెడతాను!"

తాయిలాల ఆశపెట్టి మళ్ళా లోపలికి పోయింది రాధ.

వెళ్తూ వెళ్తూ భర్త కళ్ళల్లోకి చుఱుక్కున చూసింది.

ఆ చూపులో వాడి ఉంది... వేడి ఉంది... తిరస్కారం ఉంది... హెచ్చరిక ఉంది!

భార్య తత్వం తెలిసిన మూర్తి... పత్రికలో తల దూర్చి అలానే ఉండి పోయాడు.

'విజయ్'ని అమ్మాయిలా అలంకరిస్తూంటే ఏదో ముద్దూ ముచ్చటా అనుకొన్నాడు మొదట. ఇలా మొద్దులా... అడంగి వాణ్ణిగా మారుస్తుం దనుకోలేదు. పెరుగుతున్నకొద్దీ విజయ్ 'అబ్బాయ్' కాదన్నట్టే ప్రవర్తిస్తున్నది రాధ.

వాణ్ణి 'బాబూ' అని పిలవగా తానింతవరకూ వినలేదు.

'చిట్టీ' అంటుంది... 'చిన్నారీ' అని బుజ్జగిస్తుంది.

చక్కా తలదువ్వి జడలు వేస్తుంది. పూలు పెడుతుంది. కాటుక దిద్దుతుంది. మెళ్ళో హారంకూడా వేస్తుంది. చెవులు కుట్టించి జూకాలు తగిలించింది. చుట్టుప్రక్కల ఆడపిల్లల్ని పోగుచేసి కత్తు కలిపింది.

ఆయింటి ఆవరణలో పూసేపూలు... రాధ పెట్టే తాయిలాలు వాళ్ళందరికీ ఆకర్షణలు!

ఓరోజు ఊరుకోలేక అన్నాడు మూర్తి నవ్వుతూ.

"ఇదేమిటి రాధా! అబ్బాయి నలా అమ్మాయిని చేస్తున్నావ్!" అని.

ఆ నవ్వులో నవ్వు కలిపింది రాధ.

"అదే ప్రయత్నం లో ఉన్నా." నన్నది ఎగతాళిగా.

పరిహాస మనుకొన్నాడు ఆరోజు. అది యిప్పుడు నిజమై కూర్చున్నది.

ఎప్పుడూ వంటింట్లో తల్లి చెంగు పట్టుకొని తిరగటం తప్ప తన దగ్గఱకు వచ్చేవాడే కాదు. ఎప్పుడైనా దగ్గఱకు తీస్తే పాములూ... జెఱ్ఱులూ పాకినట్టుండేది వాడికి.

ఓరోజు పేరంటానికి బయలుదేరింది రాధ. ఆ వెనకాలే తయారయ్యాడు విజయ్

కొడుకు రూపం చూసి నివ్వెఱపోయాడు మూర్తి.

అప్పటికి వాడికి ఏడేళ్ళు.

అచ్చం ఆడపిల్లలా తయారు చేసింది వాణ్ణి రాధ క్రొత్తగా చూసినవాళ్ళు వాణ్ణి 'అబ్బాయంటే' ఛస్తే నమ్మరు.

'ఆ గౌనూ...పూలూ...కాటుకా... మెళ్ళో నెక్లెసూ... మొఖాన ఇంత పౌడరూ... ఛీ ..ఛీ...' అనిపించింది మూర్తికి.

"ఏమిటా వేషం...ఎక్కడి కేంటి?" పెద్దగొంతుచేసి అడిగేడు మూర్తి కొడుకుని.

ఇంకో సమయంలో అయితే ఆ గొంతు విని బిక్కమొగం వేసేవాడు.

"సమర్త బంతికి ..!"– తడుంకోకుండా చెప్పేశాడు ... పేరంటానికి వెళ్ళే హుషార్‌లో. వాడి మనస్సంతా తినబోయే చిమ్మిడిముద్దలమీద ఉంది.

మూర్తి ముఖం ఆముదం తాగినట్టు అయింది సుపుత్రుడి జవాబుకు

రాధ అటు తిరిగి కిసుక్కుమన్నది. నోటికి కొంగు అడ్డంపెట్టుకొని. కొడుకు బుగ్గలు పుణికింది ... మురిపెంకొద్దీ!

కోపంతో ఉడికిపోయాడు మూర్తి.




చెడబడా బాది ఇద్దర్నీ గదిలో పెట్టి తాళం వేద్దా మనుకున్నాడు.

కాని అప్పటికే కొడుకును తీసుకొని గడప దాటింది రాధ.

నిశ్చేష్టుడై నీరసపడిపోయాడు మూర్తి ఒక్కసారి.

అలానే ఇరవైయేళ్ళు గడిచినై. రాధ మారలేదు. మీసాలూ గడ్డాలూ వస్తున్నా 'విజయ్' యథాప్రకారం తల్లి శిక్షణలో పెరిగి పెద్దవాడయ్యాడు.

ఎందుకనో రాధకు మళ్ళా పిల్లల్లేరు.

కొడుకైనా ...కూతురైనా 'విజయ్' ఒక్కడే ఆమెకు.

'విజయ్' నడుస్తుంటే స్త్రీ నడిచినట్టుంటుంది.

అతని మాటలు వినటానికి . ఆటలు పట్టించడానికి కాలేజీ ఆడపిల్లలు చుట్టూ చేరేవాళ్ళు.

మేనమామ కూతురు సుభద్రతో కలిసి జంటగా కాలేజీకి పోయేవాడు విజయ్.

'ఆడంగి సింగడు'– స్నేహితులు గేలి చేసేవాళ్ళు మొదట. కాని క్రమంగా విజయ్ కళాపిపాసముందు వాళ్ళు లొంగిపోవడం మొదలెట్టేరు.

విజయ్‌లో వింత ఆకర్షణ ఉంది. అతనిది కిన్నెర కంఠం – చక్కగా పాడతాడు, అభినయిస్తాడు; నృత్యం కూడా చేతనవును. కాలేజీ మ్యూజియంలో విజయ్ బొమ్మలికి ప్రత్యేక స్థానముంది. పాటల పోటీల్లో ప్రైజులన్నీ అతనికే.

విజయ్‌కి ఆడపిల్లల్తోనే ఎక్కువ స్నేహం. వాళ్ళకు పూలు తెచ్చి ఇచ్చేవాడు. వాళ్ళ ఒంటికి ఎటువంటి చీరలు బాగుంటాయో సలహాలిచ్చేవాడు. సూటయ్యే జాకెట్ చెప్పేవాడు. వాళ్ళ ముందు వాళ్ళకంటే ఎక్కువ సిగ్గుపడేవాడు.

విజయ్ చొరవ క్రమంగా ఆడపిల్లలందరికీ అలవాటయి, అందరితలలోనూ నాలుకయ్యాడు.

ఇప్పుడు విజయ్ అంటే అందరికీ గౌరవమూ, అభిమానమూ!

కాలేజీ వార్షికోత్సవంలో 'విజయ్' ప్రముఖపాత్ర వహించాడు.

సత్యభామ వేషంవేసి, ఒయ్యారితనం ఒలికిస్తున్న ఆ వగలు చూచి విస్తుపోయారు ప్రేక్షకులు. ఆ వేషం వేసింది మగవాడని తెలిసి ఇంకా ఆశ్చర్యపోయారు పోటీనిర్ణేతలు.

తమకం పట్టలేక బావను కౌగలించుకొని ముద్దులు కురిపించింది సుభద్ర ఇంటికి రాగానే.

అప్పుడే కాలేజీనుంచి వచ్చిన మూర్తికి ఆ దృశ్యం కళ్ళబడింది. ఎంతో తృప్తితో పొంగిపోయాడు ఆప్రొఫెసర్.

తా నిప్పుడు లెక్చరర్‌గాదు, ప్రొఫెసర్!

"తన బిడ్డ, మగబిడ్డ, పురుషుడు!" ఏదో గర్వరేఖ ఓ క్షణం అతని కళ్ళల్లో నాట్యమాడింది. గాఢాంధకారంలో ఓ మెరుపు మెరిసి దారి కన్పించినట్టయింది.

* * *

విజయ్‌కి ఆ వేసవిలో పెళ్ళి చేసింది రాధ.

బావతో కలిసి షికార్లు పోతూ, రిక్షాలో కూర్చుని జంటగా కాలేజీనుంచి కలిసి దిగేప్పుడు లేని సిగ్గు ఒక్కసారి ఆవరించింది సుభద్రకు పెళ్ళిపీటలమీద.

రాధ కొడుకును గదిలోకి పంపుతూ, ఏదో చెవిలో గుసగుసలాడింది.

పందిరిమంచం మీద పండుకొన్న సుభద్ర మత్తుగా కళ్లు తెరిచింది ముఖం మీద పడిన గంధపుచినుకులకు.

ఎదురుగా బావ లేడు. 'సత్యభామ' ప్రత్యక్షమయింది.

గాభాలున లేచింది సుభద్ర.

సత్యభామను కౌగిట్లో నలిపి ఉక్కిరి బిక్కిరిచేసింది. బావకంటె "సత్యభామ" అంటేనే ఆ జవరాలి కిష్టం.

తమిదీరని కోర్కెలు ఆరాత్రి ఆదంపతుల్ని నిద్రపోనీయలేదు. నవదంపతులతో ఆ ఇల్లు మళ్ళా కలకలలాడింది.

మనమరాల్ని ఎత్తుకొనేదాకా కంటి మీద కూర్కులేదు రాధమ్మకు.

* * *

మనమరాలు పుట్టినరోజు పెద్ద పండుగ చేసింది...పట్టణమంతా పిలిచి. తనకు కూతురు పుట్టకపోయినా... తన కొడుక్కు కూతురు పుట్టింది। -అదీ ఆమె గర్వం। అదీ ఆమె సాధన।

'లేకపోతే తనతోనా పందెంవేసేది। తాను సాధించింది...।' ఎనలేని తృప్తి రాధకళ్ళల్లో దోబూచులాడింది.

'సుభద్రా సత్యభామ'ల్ని కలిపి ఫొటో తీయించింది రాధ. భర్త చేతి కిచ్చింది చూడమని.

కొడుకును గుర్తుపట్టేడు మూర్తి. భార్యవ్యూహం మనసులో తళుక్కుమంది.

తాను ఓడిపోయినట్టు మొదటిసారిగా తల దించాడు మూర్తి భార్యముందు.

ఆపసివాడి బొమ్మపక్కనే 'సత్యభామా సుభద్రల ఫొటో' విజయ చిహ్నంగా తగిలించి భర్తప్రక్కలో చేరింది రాధ... ఆరాత్రి.

ఇరవైయేళ్ళ దీర్ఘవిరహం ఆరాత్రి మంచులా విడిపోయింది. రాధ ఎంతైనా ఆడుది. నిశ్చింతగా భర్తప్రక్కనే గువ్వలా ముడుచుకుపోయి ... హాయిగా నిద్రపోయింది ... మర్నాడు అంత ప్రొద్దెక్కేదాకా।

———